ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నర్సింహారావు

దిల్‌సుఖ్‌నగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టీ నర్సింహారావు అన్నారు. ఆర్‌కేపురం వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం ప్రాంగణం నుంచి వరద బాధితుల కోసం నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే డీసీఎం వాహనాన్ని శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ నుంచి దాదాపు రూ.20 లక్షల విలువైన నిత్యావసరాలు, దుస్తులు, చిన్నారులకు ఆట వస్తువులను అందిస్తున్నామన్నారు. 1000 కిట్లను వరంగల్‌లోని ములుగు, ఖమ్మం, నల్గొండలోని ప్రాంతాల్లోని బాధితులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీశ్, వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ కిరణ్, పాండు రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, విక్రం రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి రవీంద్ర కుమార్, ట్రెజరర్ ఉపేందర్, క్రెడాయి ఈసీ మెంబర్ మురిశెట్టి శ్రీనివాస్, యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విక్రమ్, ప్రధాన కార్యదర్శి మేఘన, ట్రెజరర్ అక్షయ్, ఉపాధ్యక్షుడు రతన్, వాసు, అభినవ్, మహేశ్, సభ్యులు బద్రీనాథ్, రోహిల్, గారిశెట్టి శ్రీనివాస్, అంజయ్య, జగన్, సామాజిక సేవకులు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న మహ్మద్ ముజిబుల్ ఆలా

సైదాబాద్: మహ్మద్ ప్రవక్త బోధనలు అందరికీ అనుసరణీయమని జమాతే ఇస్లామి హింద్ మలక్‌పేట శాఖ అధ్యక్షుడు మహ్మద్ ముజిబుల్ ఆలా అన్నారు. సైదాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం సంస్థ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని తమ సంస్థ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను 15 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15న మొదటిరోజు సైదాబాద్‌లోని మహారాజా ఫంక్షన్‌హాల్‌లో సీరత్ ఎక్స్‌పో–2024 పేరిట ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో మహ్మద్ ప్రవక్త బాల్యం, వివాహం, సామాజిక జీవితం, ఆయన బోధనలతో కూడిన మోడళ్లు, డాక్యుమెంటరీ ఉంటుందని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించామని విజేతలకు కార్యక్రమం రోజున బహుమతులు అందిస్తామన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు అబ్దుల్ ఖాదర్, రజా అహ్మద్ ఖాన్, జిలానీ పాల్గొన్నారు.

నేటి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



టీపీసీసీ లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టీఐ విభాగం స్టేట్ కన్వీనర్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

నాగోలు: నేడు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయవాది, టీపీసీసీ స్టేట్ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్, లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టీఐ విభాగం స్టేట్ కన్వీనర్ నూనె ప్రభాకర్ సూచించారు. టీపీసీసీ లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టీఐ విభాగం స్టేట్ కన్వీనర్ గా నూనె ప్రభాకర్ ఎన్నికైన సందర్భంగా ఆర్‌టీఐ యాక్ట్–2005 తెలంగాణ స్టేట్ బెస్ట్ ప్రాక్టీషనర్ అన్నెబోయిన మట్టయ్య, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు గుంట ప్రేమ్ కుమార్, హైకోర్టు న్యాయవాదులు మన్నెం మల్లయ్య, డీ రాములు, ఎస్. నాగేశ్వరరావు, బీ లక్ష్మయ్య, చల్లా రామ్ కల్యాణ్ ఎల్‌బీనగర్‌లో శుక్రవారం నూనె ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి, శాలువాతో సత్కరించి అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విద్యుత్‌నగర్, ఆటోనగర్, బీరప్పటెంపుల్, ఆంధ్రకేసరినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉ.10 గంటల నుంచి 11.30 వరకు, 11కేవీ విశాలాంధ్రనగర్, విష్ణు థియేటర్, శారదానగర్, గణేశ్‌నగర్ ఫీడర్ల పరిధి ప్రాంతాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మ.3 వరకు, 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్ పరిధి కాలనీల్లో మ.1.30 నుంచి 3 గంటల వరకు, 11కేవీ నూతన నాగోలు, రాక్‌హిల్స్, హైకోర్టు, లక్ష్మీగణపతి ఫీడర్ల కింద మ.3 నుంచి సా.4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



గణనాథుల నిమజ్జన సందడి

చైతన్యపురి: సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌పై నిమజ్జన సందడి నెలకొన్నది. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి చెరువులో నిమజ్జనం చేస్తున్నారు. నిమజ్జనానికి వచ్చే మండపాల నిర్వాహకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ శాఖ అధికారులు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా పోలీసులు నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలు అమర్చారు. కట్టపై ఐదు క్రేన్లు ఏర్పాటు చేశామని, చివరి రోజు మరో మూడు క్రేన్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. మున్సిపల్, పోలీస్, ఇరిగేషన్, ఎలక్ట్రికల్ అధికారులు నిత్యం నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా నిమజ్జనం అయిన గణనాథుల విగ్రహాలు, వ్యర్థాలను నీటి నుంచి క్రేన్ల ద్వారా బయటకు తీసి ప్రత్యేక వాహనాల్లో తరలిలిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 1200 విగ్రహాలు (అడుగు పైన) వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలివచ్చినట్లు అధికారులు తెలిపారు.



మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణం వద్ద..

మన్సూరాబాద్ పెద్ద చెరువులో..

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య నేతృత్వంలో సిబ్బంది మూడు షిఫ్టులుగా కొలను వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. సమీప కాలనీల నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకవస్తున్నారు. దీంతో కొలను ప్రాంతమంతా సందడిగా మారింది. వనస్థలిపురం పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.



చెరువు కట్టపై చెట్ల కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



సరూర్‌నగర్ కట్టపై బందోబస్తులో పోలీసులు



సరూర్‌నగర్ చెరువు వద్ద సందడి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరలు.

(కిలో... రూపాయల్లో) టమాట రూ. 23, వంకాయ రూ. 45, బెండ రూ. 50, పచ్చిమిర్చి రూ. 18–28, కాకర రూ. 52, బీర రూ. 55, క్యాబేజీ రూ. 16, ఫ్రెంచి బీన్స్ రూ. 65, క్యారెట్ రూ. 50, దొండ రూ. 40–43, చిక్కుడు రూ. 95, గోకర రూ. 45, బీట్‌రూట్ రూ. 28, క్యాప్సికం రూ. 70, ఆలు రూ. 37, దోస రూ. 18, సొర రూ. 19, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 54, చామగడ్డ రూ. 40.ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



కార్మికులకు రిక్షాలు అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అన్నారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందికి చెత్త తరలించే కొత్త రిక్షాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఎలక్ట్రికల్ రిక్షాలు ఏర్పాటు చేస్తే పనులు త్వరగా జరుగుతాయని, ఈ విషయమై కౌన్సిల్ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రమేశ్, ఎస్‌ఎఫ్‌ఏలు వై. శ్రీనివాస్, నర్సింగ్, సుభాష్, గణేశ్, ముజీబ్, శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ లెవల్ కబడ్డీ పోటీలు



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నాగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగోలు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఉప్పల్ జోనల్ లెవల్ అండర్–14, అండర్–17 కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో నాగోల్ జడ్పీ పాఠశాల విద్యార్థుల జట్టు చాంపియన్స్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన అండర్ –17 ఫైనల్‌లో నాగోలు పాఠశాల ఉప్పల్ సత్యసాయి హైస్కూల్‌పై, అండర్–14 బాలుర ఫైనల్స్‌లో నాగోలు ప్రభుత్వ పాఠశాల ఉప్పల్ ఇందిరా పాఠశాల జట్టుపై గెలుపొందింది. బాలికల విభాగంలో అండర్ –17 విభాగంలో ఉప్పల్ ప్రభుత్వ పాఠశాల ప్రథమ, మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల ద్వితీయ స్థానం సాధించింది. అండర్–14 విభాగంలో ఉప్పల్ సత్యసాయి పాఠశాల ప్రథమ, ఉప్పల్ శ్రీనివాస స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. నాగోల్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, ఉప్పల్ జోనల్ స్కూల్ జోనల్ లెవల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పద్మావతి, నోసా ప్రెసిడెంట్ కందికంటి కన్నా గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, డోనార్ కమిటీ సభ్యులు జిల్కపల్లె శ్రీనివాస్ రెడ్డి, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, పల్లే లింగంగౌడ్, నల్లా ఉమామహేశ్వర్ గుప్తా, బొడ్డుపల్లి మహేందర్, సహదేవ్, ఫిజికల్ డైరెక్టర్లు శంకర్, మమత, ఉపాధ్యాయులు రవికుమార్, విమల, ప్రముఖులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగోలు: పేకాటస్థావరంపై ఎల్‌బీనగర్ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్‌రింగ్ రోడ్డు సమీపంలోని పిండి నారాయణరెడ్డి కాలనీ ఈదులకంటి రాంరెడ్డి గార్డెన్ సమీపంలో గురువారం రాత్రి పేకాడుతున్నారనే సమాచారం మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు దాడులు చేశారు. చింతల ధనరాజ్‌రెడ్డి, శేగిరెడ్డి పవన్‌రెడ్డి, చేగూరి వెంకట్‌రెడ్డి, బుద్దుల శ్రీనివాస్‌రెడ్డి, వంగూరు మన్యం రెడ్డి, గొంది శ్రీనివాస్‌రెడ్డి, గొండి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 30,550, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో..

ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ వద్ద ఉన్న మారుతి రెసిడెన్సీ హోటల్‌లో గురువారం రాత్రి పేకాడుతున్న నలుగురిని ఎల్‌బీనగర్ పోలీసులు పట్టుకున్నారు. జడ్డిమెట్ల రాజేందర్, అంబడి శేఖర్‌బాబు, చినుకుంట్ల కార్తీక్‌గౌడ్, బాలి శివాజీని అరెస్టు చేసి వారి నుంచి రూ. 51,110 , మూడు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ నాలుగో అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగరాజు తీర్పునిచ్చారు. కోర్టు ఏపీపీ శోభారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పహాడిషరీఫ్ ఠాణా పరిధిలో నివాసం ఉండే శివకుమార్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. 2020, సెప్టెంబర్ 29న ప్రయాణికుల కోసం వేచి చూస్తుండగా సయ్యద్ ఉస్మాన్ హుస్సేన్ అలియాస్ మెంటల్ ఉస్మాన్ (31) మద్యం మత్తులో వచ్చి తనని ఇంటి వద్ద దింపాల్సిందిగా కోరాడు. దీంతో ఆటోలో ఎక్కించుకోగా ఉస్మాన్ అకారణంగా డ్రైవర్‌ని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన శివకుమార్ ఆటో వదిలి పారిపోతుండగా నిందితుడు బ్లేడ్‌తో విచక్షణారహితంగా దాడిచేయడంతో తప్పించుకుని పహీడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు శుక్రవారం నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు 11వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయండి



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని ఆంధ్రకేసరినగర్‌లో భారీ వాహనాల వల్ల ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారిందని కాలనీవాసుల ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం మ్యాన్‌హోల్‌ను పరిశీలించారు. జలమండలి మేనేజర్ వాహిని, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు రంగారావు, అశోక్, కైలాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు



రాపోలు జైప్రకాశ్‌ను సన్మానిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

మలక్‌పేట: ఏ రంగంలోనైనా కష్టపడి పని చేసే వారికే గుర్తింపు ఉంటుందని నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్. రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత రాపోలు జైప్రకాశ్ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శాలీవాహననగర్ పార్కులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైప్రకాశ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి ప్రజా సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, స్వరూప్‌సింగ్, జి. శ్రీనివాస్, రత్నాకర్‌రావు, మురళీకృష్ణ, మల్లారెడ్డి, గోవర్ధన్, మధుసూదన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

చంపాపేట: సీపీఐ(ఎం) పార్టీ అఖిల భారత కార్యదర్శి, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మృతి దేశ రాజకీయాలకే తీరని లోటు అని రాష్ట్ర గిరిజన సంఘ అధ్యక్షుడు ధర్మానాయక్ అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చౌరస్తాలో ఎల్‌బీనగర్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సీతారాం సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, వెంకటయ్య, యాదయ్య, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, శాంతికుమారి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్క నాటుతున్న కార్పొరేటర్ అరుణ, హార్టికల్చర్ అధికారులు

నాగోలు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ కాలనీలో 75వ వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అమ్మ పేరిట మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ అమ్మకి గుర్తుగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏఈ మేధా, సూపర్‌వైజర్ మానస, గ్రీన్‌ఫీల్డ్ కాలనీవాసులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల అరెస్టు



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డితో పాటు పలువురు నేతలను ఎల్‌బీనగర్ పోలీసులు శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి అరెస్టు చేసి స్టేషన్‌ను తరలించారు. ఈ సందర్భంగా జక్కిడి మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమ అరెస్టుకు నిరసనగా చేపడుతున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం తగదన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు వస్తున్నాయని, బీఆర్‌ఎస్ నేతలంటే కాంగ్రెస్ నేతలకు వణుకు పుడుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తిలక్‌రావు, సిద్దగోని జగదీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

గణపయ్యా.. దీవించయ్యా..

- వైభవంగా కొనసాగుతున్న నవరాత్రులు
- విశేష పూజలు, అన్నదానాలు

గణేశ్ నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. గణపయ్యా.. దీవించయ్యా.. అంటూ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు శుక్రవారం పలు మండపాలను సందర్శించి వినాయకుడికి పూజలు చేశారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొన్ని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

–ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ బృందం



బీఎన్‌రెడ్డినగర్‌లో పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో పూజల్లో ఏసీపీ కాశిరెడ్డి, మాజీ కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



ఎల్‌బీనగర్‌లో పూజల్లో ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, సీఐ వినోద్‌కుమార్..



కొత్తపేటలో పూజల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్‌గుప్తా..



బండ్లగూడ రాజీవ్ స్వగృహ పూజల్లో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా..



వాసవీ కాలనీ పూజల్లో జిల్లా జడ్జిలు నిష్కాపత్రుడు, గోపిక నాగ శ్రావ్య, చిలుక ఉపేందర్‌రెడ్డి



హయత్‌నగర్‌లోని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి..



హరిపురికాలనీలో పూజల్లో కాలనీ మహిళలు..



త్రివేణినగర్‌లో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌ను సన్మానించిన లక్ష్మణ్‌ఠాకూర్



గడ్డిఅన్నారం రాజీవ్‌యూత్ కమ్యూనిటీహాల్లో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేశ్



అక్బర్‌బాగ్ నవజ్యోతి మండపం వద్ద.. నర్సింహ, శ్రీధర్‌రెడ్డి, జగన్



హయత్‌నగర్ ఫైర్ స్టేషన్ వద్ద కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, బీజేపీ నాయకులు నరేశ్